సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 4 । ఆగస్టు । 2024



దర్గాగా.. ఆలయ భూముల కబ్జా

అందరికీ వరాలిచ్చే అమ్మవారు..అన్యాక్రాంతమవుతున్న తన భూములను రక్షించుకోలేని పరిస్థితి. పాస్‌బుక్‌లు సృష్టించుకొని కొందరు వీటిని దక్కించుకున్నారు. -8లో



విశాఖ జట్టు ఘన విజయం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయం సాధించగా, మరో రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.150	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 641 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

నేడు నూతన బస్సులు ప్రారంభం

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప ఆర్టీసీ బస్టాండులో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు నూతన ఆర్టీసీ బస్సులను రాష్ట్ర రవాణా, యువజన క్రీడలశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. కడప డిపోకు సంబంధించి 2, బద్వేలు 4, పులివెందుల 4, జమ్మలమడుగు డిపోకు సంబంధించి 6 బస్సులను ప్రారంభిస్తారన్నారు. ప్రయాణికుల సుఖమయమైన ప్రయాణానికి ఆర్టీసీ అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

తరిగొండ ఆలయంలో విశేష పూజలు



స్వామివారికి విశేష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

గుర్రంకొండ (అన్నమయ్య జిల్లా): మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని రంగురంగుల పుష్పాలతో అందంగా అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

36 వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలు

రాయచోటి: అన్నమయ్య జిల్లాలో 36వేల హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం అమలుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా సూక్ష్మ నీటిపారుదలశాఖ అధికారి వెంకటేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సూక్ష్మనీటి పారుదల పరికరాలు అవసరం ఉన్న రైతులు, వారి రైతు సేవా కేంద్రాలలో ఉన్న గ్రామ వ్యవసాయ అసిస్టెంట్, గ్రామ ఉద్యానవన అసిస్టెంట్ తదితర అధికారులను సంప్రదించి బయో మెట్రిక్ విధానంలో ఎంచుకున్న కంపెనీకి రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చన్నారు. అలాగే రైతు సేవా కేంద్ర సిబ్బందిని, సూక్ష్మ నీటిపారుదల క్షేత్రస్థాయి సిబ్బందిని, వారి పరిధిలో నీటి వసతి కలిగిన రైతులను గుర్తించి నమోదు కార్యక్రమం ప్రారంభించాలని ఆయన ఆదేశించారు.

ఐటీఐలలో 3వ విడత అడ్మిషన్లు



కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్‌ఐటీఐలలో మిగిలిన సీట్లకు 3వ విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్లు ప్రభుత్వ మైనార్టీ ఐటీఐల జిల్లా కన్వీనర్, ప్రిన్సిపాల్ జ్ఞాన కుమార్ తెలిపారు. పది, ఇంటర్ పాస్, ఫెయిల్ అయిన విద్యార్థులు అడ్మిషన్లు పొందేందుకు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ అప్లికేషన్స్‌ను ఆన్‌లైన్ ద్వారా iti.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. విద్యార్థులు తమ అప్లికేషన్ రిజిస్ట్రేషన్ కోసం విద్యార్హతల ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫొటో, ఆధార్‌కార్డు, కులధృవీకరణ పత్రాలు తీసుకుని మీకు దగ్గరలోని ఐటీఐ వద్దకు వెళ్లి వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. అప్లికేషన్ రిజిస్టర్, వెరిఫికేషన్‌కు ఆగస్టు 26వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. ప్రభుత్వ ఐటీఐలో చేరే వారికి ఆగస్టు 29న, ప్రైవేటు ఐటీఐలో చేరడానికి ఆగస్టు 31న ఆయా ఐటీఐలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు జ్ఞానకుమార్ తెలిపారు.

బీఎస్‌ఎన్‌ఎల్ వినియోగదారులు 4జీకి అప్‌గ్రేడ్ చేసుకోవాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలోని బీఎస్ఎన్ఎల్ వినియోగదారులు 4జీ సిమ్‌కు అప్ గ్రేడ్ కావాలని జిల్లా బీఎస్ఎన్ఎల్ ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి. ముజీబ్‌పాషా పేర్కొన్నారు. శనివారం కడపలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీఎస్ఎన్ఎల్ దశల వారీగా పాన్ ఇండియా ఆధారంగా 4జీ టెక్నాలజీని ప్రవేశ పెట్టిందన్నారు. జిల్లాలోని చాలా మంది తమ మొబైల్ సేవలను 2జీ, 3జీ సిమ్‌తో ఉపయోగిస్తున్నారని తెలిపారు. ఈ వినియోగదారులకు వారి ప్రాంతాల్లో 4జీ సేవలను ప్రారంభించినప్పుడు అంతరాయం ఏర్పడుతుందన్నారు. 54040కి సిమ్ అనే సందేశాన్ని పంపడం ద్వారా కస్టమర్లు తమ సిమ్ రకాన్ని 2జీ, 3జీ, 4జీగా సులభంగా కనుగొనవచ్చు. ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ 2జీ, 3జీ వినియోగదారులకు ఉచిత 4జీ అప్‌గ్రేడేషన్ ఆఫర్‌ను ప్రవేశ పెట్టిందన్నారు. ఈ ఉచిత సిమ్‌లు బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీసు సెంటర్లలో, బీఎస్ఎన్ఎల్ ఏజెంట్లు, రీటైలర్ల దగ్గర అందుబాటులో ఉన్నాయన్నారు.

కూటమిలో కుమ్ములాటలు

- డీలర్‌షిప్‌ల కోసం తీవ్ర పోటీ
- అధికారం చేపట్టిన రోజు నుంచి యత్నాలు మొదలు



బద్వేలు (వ్యవసాయం): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన రోజు నుంచి టీడీపీ నాయకులు,కార్యకర్తలు ఆదాయమార్గాలపై కన్నేశారు.గ్రామాల్లో వివిధశాఖల్లో ఉన్న తాత్కాలిక ఉపాధి పథకాలు బలవంతగా లాక్కోవాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన కార్మికులను ఇంటికి పంపే ప్రయత్నం చేశారు.చౌకదుకాణాల డీలర్ షిప్‌ల కోసం మండలాల పరిధిలో కూటమి కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయాల వద్ద క్యూ కట్టారు. ఒక్కో డీలర్ షిప్ కోసం గ్రామాల్లో పదుల సంఖ్యలో పోటీపడుండటంతో ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో అధిష్టానం ఉండటం గమనార్హం.వైఎస్సార్ జిల్లా బద్వేల్ నియోజకవర్గం కలసపాడు,కాశినాయన,పోరుమామిళ్ల,బి.కోడూరు,మండలాల్లో ఈ విషయం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. ఇప్పటికే కాశినాయన మండలంలో రాజకీయ ఒత్తిడికి తలొగ్గి ఐదుగురు రేషన్ షాపు డీలర్లతో రాజీనామా చేయించారు.కాశినాయన మండలంలోనిగొంటువారిపల్లె, బాలాయపల్లె,గంగనపల్లె,ఓబులాపురం,ఉప్పలూరులో డ్వాక్రా మహిళా సంఘాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తున్నారు. ఎలాంటి ఫిర్యాదులు లేకపోయినా వారిచేత రెవెన్యూ అధికారులు రాజీనామ చేయించారు.మరోవైపు మిగతా డీలర్లను కూడా రాజీనామా చేయించాలని రెవెన్యూ అధికారులే పట్టుపడుతుండటంతో ఇందులో మతలబు ఏమిటో అర్థం కావడంలేదు. పోరుమామిళ్ల ఎంఎల్ఎస్ పాయింట్ కింద కలసపాడు, అలాగే కలసపాడులో మరో ఐదు షాపులకు కొత్త పేర్లు ఎంపిక చేసినట్లు సమాచారం.చెన్నుపల్లె చౌకదుకాణానికి చల్లా వెంకటేశ్వర్లు,ఎగువ తంబళ్లపల్లె చౌకదుకాణానికి దాదా హయత్, కలసపాడు రెండో షాపునకు జి.రామమోహన్‌రెడ్డి,శంకవరం, రామచంద్రారెడ్డి,పిడుగు పల్లె యస్,రామసుబ్బారెడిలను ఎంపిక చేసినట్లు సమాచారం.

డీలర్‌షిప్‌ల కోసం ముప్పేట దాడి

బద్వేల్ నియోజకవర్గంలో తెలుగు తమ్ముళ్లు డీలర్‌షిప్‌ల కోసం ఎగబడుతున్నారు. కొందరైతే అధిష్టానానికి తెలియకుండా స్థానికంగా ఉన్న నాయకులతో ఎస్‌హెచ్‌జీ గ్రూప్ కింద ఉన్న డీలర్లను బెదిరించి తొలగించాలని రెవెన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.ప్రస్తుత డీలర్లను తొలగించి వారి స్థానంలో మాకు కేటాయించాలని ఆశావహుల జాబితా పెరిగి పోయింది. ఎవరికి వారు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.ఇప్పటికే దాదాపు 20 డీలర్ల షిప్‌లను మార్చినట్లు తెలుస్తోంది. నియోజకవర్గ వ్యాప్తంగా కలసపాడు మండలంలో 17చౌకదుకాణాలు,కాశినాయన మండలంలో 19, పోరుమామిళ్ల మండలంలో 34, బి.కోడూరులో 10, గోపవరం మండలంలో16, బద్వేల్ 37, అట్లూరు మండలంలో 19 చౌకదుకాణాలు ఉన్నాయి. అందులో 35 శాతం రెగ్యులర్ షాపులు ఉండగా మిగిలినవి ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల కింద నడుస్తున్నాయి. ఎస్‌హెచ్‌జీ గ్రూప్‌ల కింద ఉన్న చౌకదుకాణాలను ఎలాగైనా స్వాధీనం చేసుకోవాలని కూటమి నాయకులు ప్రయత్నం చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో కలసపాడు,కాశినాయన,పోరుమామిళ్ల తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది సహకారంతో కొందరు డీలర్లను ముందస్తు నోటీసులు ఇవ్వకుండా అడ్డగోలుగా తొలగించి తెలుగు తమ్ముళ్లు జూలై నెలలోనే స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు నెల చివరి నాటికి మిగిలిన వారిని తొలగించి వాటిని కూడా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.అయితే తమ డీలర్‌షిప్‌లను నిలబెట్టుకోవాలని ప్రస్తుత డీలర్లుకూడా ప్రయత్నిస్తున్నారు. ఈ కుమ్ములాటలో వినియోగదారులు డీలా పడిపోతున్నారు.ఇప్పటి వరకు ఉన్న డీలర్లు అవినీతికి పాల్పడకుండా కార్డుదారులందకీ రేషన్ షాపునకు వచ్చిన సరుకులు పంపిణీ చేస్తున్నారు. కొత్తగా వచ్చే డీలర్లు ఎలాంటివారై ఉంటారో అని ఆందోళన చెందుతున్నారు.



PORUMAMILLA MLS POINT

S.A.K.N MANDAL

PORUMAMILLA MANDAL

కాశినాయన, పోరుమామిళ్ల మండలాల్లో డీలర్లను తొలగించిన జాబితా

ఒంటిమిట్టలో సుగవాసి బ్యానర్లు చించివేత



బ్యానర్లు చించివేసిన దృశ్యం

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట మండల కేంద్రంలో సుగవాసి బాలసుబ్రమణ్యం బ్యానర్లను చించేసిన ఘటన చోటు చేసుకుంది. శనివారం రాజంపేట టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం రాత్రి ఏర్పాటు చేసిన జన్మదిన బ్యానర్లను అదేరోజు రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చించివేశారు. ఈ విషయం శనివారం తెల్లవారుజామున వెలుగులోకి వచ్చింది. దీనిపై ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదన్ రావును వివరణ కోరగా ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. కాగా ఒంటిమిట్టలో తెలుగుదేశం పార్టీకి సంబంధించి వర్గపోరు తీవ్రస్థాయిలో జరుగుతున్న విషయం తెలిసిందే.

జిల్లాలో సీఐల బదిలీలు



రాయచోటి : అన్నమయ్య జిల్లాలో సీఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు. కడప వీఆర్‌లో పనిచేస్తున్న డి. రామాంజనేయులు రాజంపేట మన్నూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు. అలాగే మన్నూరు సీఐ రవీంద్రనాథ్‌ను అన్నమయ్య జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. బద్వేల్ అర్బన్ స్టేషన్ సీఐ పి.యుగంధర్‌ను అన్నమయ్య జిల్లా పీలేరుకు, అక్కడ పనిచేస్తున్న ఎన్.మోహన్ రెడ్డిని అన్నమయ్య జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. అనంతపురం జిల్లా రాయదుర్గం రూరల్ సీఐగా పనిచేస్తున్న జె.ప్రసాద్ బాబును వాయల్పాడుకు, అక్కడ పనిచేస్తున్న పి.పులిశేఖర్‌ను మదనపల్లి తాలుకా అర్బన్ స్టేషన్‌కు బదిలీ చేశారు. మదనపల్లి అర్బన్ స్టేషన్ సీఐ ఎన్.శేఖర్‌ను అన్నమయ్య జిల్లా వీఆర్‌కు బదిలీ అయ్యారు. తిరుపతి ఎస్సీ, ఎస్టీ సెల్‌లో పనిచేస్తున్న సీఐను మదనపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు, మదనపల్లి వన్ టౌన్‌లో పనిచేస్తున్న యు.వలి బాషను అన్నమయ్య వీఆర్‌కు, తిరుమల సీసీఎస్‌లో పనిచేస్తున్న కె.రెడ్డిశేఖరరెడ్డిని కలికిరికి బదిలీ చేశారు. కలికిరి సీఐ ఆర్.మోహన్‌ను అన్నమయ్య జిల్లా వీఆర్‌కు బదిలీ చేశారు. ఇంటిలిజెన్సీలో పనిచేస్తున్న ఎస్.గురునాథ్‌ను కలకడ సర్కిల్‌కు, అక్కడ పనిచేస్తున్న డి.శ్రీనివాసులును అన్నమయ్య వీఆర్‌కు బదిలీ చేశారు. కర్నూలు వీఆర్‌లో ఉన్న కె.రమేష్‌ను మదనపల్లి రూరల్ సర్కిల్‌కు, అక్కడ పనిచేస్తున్న యు.సద్గురుడును అన్నమయ్య వీఆర్‌కు బదిలీ చేశారు. రైల్వేలో పనిచేస్తున్న హేమ సుందరరావును రైల్వే కోడూరు అర్బన్ స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న సీఐ సురేంద్రనాథ్‌రెడ్డి, రూరల్ సీఐ బాబులను వీఆర్ అన్నమయ్యకు బదిలీ చేశారు. తిరుపతి శ్రీసిటీలో పనిచేస్తున్న వి.చిన్నపెద్దయ్యను అన్నమయ్య సీసీఎస్‌కు, అన్నమయ్య వీఆర్‌లో ఉన్న బి.మల్లికార్జున గుప్తాను డీసీఆర్‌బీకి, తిరుపతి సీసీఎస్‌లో పనిచేస్తున్న పసుపులేటి రామకృష్ణను అన్నమయ్య డీఎస్‌బీకి బదిలీ చేస్తూ డిఐజీ కోయ ప్రవీణ్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు.

రూటు మార్చిన ఇసుక తోడేళ్లు

- కొనసాగుతున్న గ్రావెల్ దోపిడీ
- సుప్రీంకోర్టు తీర్పున్నా అడ్డుకట్ట వేయని యంత్రాంగం

సాక్షి ప్రతినిధి, కడప: తెలుగుతమ్ముళ్లు నైట్ షిఫ్ట్ వేసుకున్నారు. గ్రావెల్ దోపిడీ ప్రముఖంగా తెరపైకి రావడంతో పగలుకు విరామం చెప్పి రాత్రి పూట మాత్రమే కొండను కొల్లగొట్టే చర్యలను ఎంచుకున్నారు. చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణ, అన్యాక్రాంతం నేరంగా సుప్రీంకోర్టు తీర్పున్నా అడ్డుకునే సాహసం కూడా రెవెన్యూ యంత్రాంగం చేపట్టలేకపోతుంది. మరోవైపు బతుకు తెరువు కోసం చిన్న బంకు పెట్టుకున్న వారిపై ప్రతాపం చూపుతున్న ఘటన తెరపైకి వచ్చింది. గ్రీన్‌ఫీల్డ్ హైవే పనుల్లో రోడ్డు పార్మెషన్‌కు సబ్‌లీజు పనులు తెలుగుతమ్ముళ్లు తీసుకున్నారు. ఆపై తిప్పిరెడ్డిపల్లె చెరువు, గుట్టల నుంచి నిత్యం రెండు మిషన్లతో లోడింగ్ చేస్తూ లారీల ద్వారా కోట్లాది విలువ చేసే గ్రావెల్ తరలిస్తున్నారు. ఎలాంటి రాయల్టీ చెల్లించకుండా చెరువు, సమీపంలోని కొండను కొల్లగొడుతున్నారు. ఈవిషయాన్ని 'సాక్షి' వెలుగులోకి తీసుకురావడంతో పగలు విరామం పలికి, రాత్రి పూట అక్రమంగా గ్రావెల్ తరలింపు చర్యలను ఎంచుకున్నారు. శనివారం రాత్రి నిరంతరాయంగా మిషన్ల ద్వారా గ్రావెల్ తరలిస్తున్నా అటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు.

సుప్రీంకోర్టు ఉత్తర్వులు బేఖాతర్

తిప్పిరెడ్డిపల్లె లోని గోడేరు చెరువులో 50ఎకరాలు అన్యాక్రాంతమైంది. ఇదివరకే వల్లూరమ్మ చెరువు ఆక్రమణదారుల చెరలో ఉండిపోయింది. తాజాగా గోడేరు చెరువు ఆక్రమణ విషయాన్ని ఇరిగేషన్ అధికారులు ధ్రువీకరిస్తూ రాతపూర్వకంగా రెవెన్యూ యంత్రాంగానికి వెల్లడించారు. వాస్తవంగా చెరువులు, వాగులు, వంకలు ఆక్రమణ నేరంగా సుప్రీంకోర్టు పరిగణించింది. కాగా బతుకు దెరువు కోసం సచివాలయం సమీపంలో మల్లి అనే వ్యక్తి ఏర్పాటు చేసుకున్న బంకు తీసేందుకు పోలీసులు బందోబస్తుతో వెళ్లి తొలగించారు. చట్ట వ్యతిరేక చర్యల పట్ల తోక ముడుస్తున్న యంత్రాంగం అధికార పార్టీ సేవలో తరిస్తుండడం విశేషం.



బతుకు దెరువు కోసం పెట్టుకున్న బంకును పోలీసు బందోబస్తుతో తొలగిస్తున్న దృశ్యం

తహసీల్దార్ల నియామకం

రాయచోటి: అన్నమయ్య జిల్లాలోని పలు మండలాలకు నూతన తహసీల్దార్లను నియమిస్తూ శనివారం సాయంత్రం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	తహసీల్దార్
రాయచోటి	పుల్లారెడ్డి
రాజంపేట	మహబూబ్‌చాంద్
గాలివీడు	భాగ్యలత
చిన్నమండెం	నరసింహులు
వీరబల్లి	శ్రావణి
సుండుపల్లె	దైవాదీనం
నందలూరు	అమరనాథ

- అలాగే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా ఉదయ్ శంకర్‌రాజు, రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయ డివిజనల్ అడ్మినిస్ట్రేషన్ అధికారిగా తులశమ్మ, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా నాగభూషణం, అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో ల్యాండ్ అక్విటేషన్ సూపరింటెండెంట్‌గా ఎంవీ సుబ్రమణ్యం రెడ్డిలను నియమిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

మహిళపై టీడీపీ నాయకుడి దాడి

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అన్నమయ్య జిల్లా ఒంటిమిట్టలోని రాజుపాలెం లక్ష్మీదేవిపై టిడిపి నాయకుడు శివ దాడిచేసినట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయంపై బాధిత మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి వివరాల మేరకు.. మండల కేంద్రమైన ఒంటిమిట్టలోని కల్లా వీధిలో నివాసం ఉంటున్న రాజుపాలెం లక్ష్మీదేవి తన ఇంటికి పంచాయతీ నీరు చేరడంలేదని పక్కింటి వారి ఇంటిలో నుంచి నీరు తెచ్చుకుంటోంది. ఈ సమయంలో వారి ఇంటివద్ద వాటర్ ప్లాంట్ నిర్వహిస్తున్న శివ మోటార్ ఆఫ్ చేసి తన వాటర్ ప్లాంట్ కోసం మోటర్ వేసుకున్నానని అడ్డు చెప్పారు. ఆగ్రహించిన లక్ష్మీదేవి పంచాయతీ నీటిని తమ సొంత వాటర్ ప్లాంట్‌కి వాడుకోవడం ఏమిటి? ఇదెక్కడి న్యాయం అంటూ టిడిపి నాయకుడైన శివ భావ వెంకటరమణ ఇంటి వద్దకు వెళ్లి నిలదీసింది. దీంతో నన్ను అడిగే స్థాయి నీది కాదు.. అంటూ దూషించడంతో వెంకటరమణకు బాధితురాలు లక్ష్మీదేవికి మాటమాటా పెరిగింది. ఈ క్రమంలో మోటర్ ఆఫ్ చేసిన టీడీపీ నాయకుడు వెంకటరమణ బావమరిది శివ కలిసి లక్ష్మీదేవిపై చేయి చేసుకున్నారు. దీంతో లక్ష్మీదేవి అక్కడికక్కడే సొమ్మసిల్లి పడిపోయింది. అనంతరం బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ ఘటనపై ఒంటిమిట్ట ఎస్ఐ మధుసూదనరావును వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని, ఘటనపై విచారిస్తున్నామని తెలిపారు.

వైవీయూ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలు పొందండి

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం డిగ్రీ కోర్సులలో రిజిస్ట్రేషన్ అయిన విద్యార్థులు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకొని ప్రవేశాలు పొందాలని వైవీయూ ప్రవేశాల సంచాలకులు డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్ తెలిపారు. డిగ్రీ కోర్సుల ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఆన్‌లైన్ అడ్మిషన్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్(ఒఎండీసీ) వెబ్ ఆప్షన్ మొదలైందని, ఇది ఈనెల 5వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. బీఎస్సీ ఫిజిక్స్, కెమిస్ట్రీ, బీకాం కంప్యూటర్ ఆనర్స్ కోర్సులు ఈ విద్యా సంవత్సరం నుంచి వైవీయూలో ప్రారంభించామన్నారు. బయో టెక్నాలజీ, బయో ఇన్ఫర్మేటిక్స్ (బీఎస్సీ/ఎమ్మెస్సీ), అప్లైడ్ జియాలజీ (బీఎస్సీ/ఎంఎస్సీ), బ్యాచిలర్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ (పెయింటింగ్ నాలుగేళ్ల కోర్స్)లకు సంబంధించి వైవీయూ కళాశాలను విద్యార్థులు ఎంపిక చేసుకోవాలని సూచించారు. విద్యార్థుల జ్ఞానార్జనకు సహాయపడే అతి పెద్ద గ్రంథాలయం, వందల జర్నల్స్, హాస్టల్ వసతి, జిమ్, పరిశుభ్రమైన భోజనంతో పాటు, ఆహ్లాదకరమైన, విశాలమైన ప్రాంగణంలో చదువులు సాగించవచ్చన్నారు.

దగ్గరైన దూరవిద్య.!

- చదువులకు మార్గం.. సార్వత్రిక విద్యాపీఠం
- ఓపెన్ స్కూల్‌లో టెన్త్, ఇంటర్ ప్రవేశాలు
- విడుదలైన నోటిఫికేషన్

మదనపల్లె సిటీ: వివిధ కారణాల వల్ల చదువు మానేసిన వారు పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసేందుకు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా ప్రభుత్వం సువర్ణావకాశం కల్పిస్తోంది. ఈ సర్టిఫికెట్లకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల గుర్తింపు ఉంది. వీరు ఎలాంటి ఉద్యోగానికైనా అర్హులే. చదువుపై ఆసక్తి ఉన్న పలువురు ఓపెన్ స్కూల్ ద్వారా పది, ఇంటర్ పూర్తి చేసి ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అభ్యాసకులకు విద్యను మరింత చేరువ చేసేలా ప్రభుత్వం ఓపెన్ స్కూల్ తరగతులు నిర్వహిస్తోంది.

టెన్త్‌కు 35...ఇంటర్‌కు 31 కేంద్రాలు

జిల్లాలో టెన్త్‌కు 35, ఇంటర్‌కు 31 అధ్యయన కేంద్రాలు ఉన్నాయి. పదో తరగతిలో 100 మందికి, ఇంటర్‌లో నాన్ సైన్సుల్లో 40, సైన్స్‌లో100 మందికి అవకాశం ఉంది. అడ్మిషన్ పొందిన వెంటనే స్టడీ మెటీరియల్ అందిస్తారు. ప్రతి ఆదివారం, సెలవు దినాల్లో ఆయా అధ్యయన కేంద్రాలలో కాంటాక్టు తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతితో పాటు ఇంటర్‌లో ఆర్ట్స్ గ్రూపులైన హెచ్‌ఈసీ, సీఈసీ, సైన్సు గ్రూపులైన ఎంపీసీ, బైపీసీ, ఎంబైపీసీ, ఎంఈసీలో ప్రవేశాలు పొందవచ్చు. ఈ సర్టిఫికెట్లు ఉన్నత చదువులకు, ఉద్యోగాలకు, పదోన్నతులకు ఉపయోగపడుతున్నాయి. అభ్యర్థులు పదో తరగతి మార్కుల జాబితా లేదా జనన ధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్‌కార్డు, కులధ్రువీకరణ పత్రం, బ్యాంకు పాస్‌బుక్, ఫొటో, సంతకంతో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



కాంట్రాక్టు తరగతులకు హాజరైన అభ్యాసకులతో ఓపెన్‌స్కూల్ రాష్ట్ర, జిల్లా కోఆర్డినేటర్ (ఫైల్‌ఫొటో)

ప్రవేశాలు ఇలా..

జులై 31వతేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా ఈనెల 28వతేదీలోగా ఆన్‌లైన్ అడ్మిషన్ పొందవచ్చు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 29 నుంచి సెప్టెంబర్ 4వతేదీ వరకు అడ్మిషన్ పొందవచ్చు.

అర్హతలు ఇవే..

ఎస్ఎస్‌సి కోర్సులో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 సంవత్సరాలు వయసు నిండి ఉండాలి. గరిష్ట వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతో పాటు టీసీ, రికార్డు షీటు, పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం, ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, ఎస్ఎస్‌సి టీసీని దరఖాస్తుతో పాటు అందజేయాలి. ఎస్సీ,ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, దివ్యాంగులు ధ్రువీకరణ పత్రాన్ని అందజేయాల్సి ఉంటుంది.

కనీసం 24 కాంట్రాక్టు తరగతులు..

ఓపెన్ స్కూల్‌లో పది, ఇంటర్ అడ్మిషన్ పొందిన వారికి ప్రతి ఆదివారం, నెలలో రెండో శనివారం అధ్యయన కేంద్రాల్లో 30 కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తారు. కనీసం 24 కాంట్రాక్టు తరగతులకు హాజరైన వారిని మాత్రమే అనుమతిస్తారు. సార్వత్రిక పాఠశాలలో చేరే వారికి స్టడీ మెటీరియల్ సరఫరా చేస్తారు.


ఐదేళ్లలో పూర్తి చేయాలి

అభ్యాసకులు నిర్ణీత ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణులవ్వాలి. ఇంటర్ పరీక్షలు రాసే వారు మాత్రం 10 పాసై రెండేళ్ల వ్యవధి ఉంటే ఐదు సబ్జెక్టులు ఒకేసారి రాసుకునే అవకాశం ఉంది. రెండేళ్ల వ్యవధి లేకపోతే నాలుగు సబ్జెక్టులు రాసి, రెండేళ్లు పూర్తయిన తర్వాత మిగిలిన ఒక సబ్జెక్టును రాసుకోవచ్చు. అడ్మిషన్ పొందిన అనంతరం ఐదేళ్లలో తొమ్మిది సార్లు పరీక్షలు రాసి ఉత్తీర్ణత పొందకపోతే తిరిగి కొత్తగా అడ్మిషన్ పొందాల్సి ఉంటుంది.

సర్టిఫికెట్లకు గుర్తింపు ఉంది

సార్వత్రిక పాఠశాలలో చదివి ఉత్తీర్ణులయ్యే విద్యార్థులకు అందించే సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంటుంది. ఇంటర్ ఉత్తీర్ణులైన వారు ఎంసెట్, డైట్‌సెట్ వంటి పరీక్షలతో పాటు ఇంటర్ అర్హతతో పొందే అన్ని ఉద్యోగాలకు అర్హులే.


నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి



చదువుకోవాలనుకునే వారికి ఓపెన్‌స్కూల్ సువర్ణావకాశం. ఆసక్తి ఉన్నవారికి, చిరు ఉద్యోగాలు చేస్తూ పదోన్నతులు పొందాలనుకునే వారికి సార్వత్రిక విద్య వరంలాంటిది. ఉపాధి, ఉన్నత చదువులకు ఉపకరిస్తుంది. ఈ సర్టిఫికెట్లకు ప్రభుత్వ గుర్తింపు ఉంది. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

-శ్రీనివాసరాజు, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్

చదువు మానేసిన వారికి సువర్ణావకాశం



వివిధ కారణాలతో మధ్యలోనే చదువు మానేసిన వారికి ఓపెన్ స్కూల్ సువర్ణావకాశం. ఉద్యోగాలు, ఇతర పనులు చేసుకుంటూ కూడా ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు పొందవచ్చు. ఆదివారం, సెలవు దినాలలో సబ్జెక్టు టీచర్లచే కాంట్రాక్టు తరగతులు నిర్వహిస్తున్నాం. చదువుకోవాలనే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-పి.మహమ్మద్‌ఖాన్, ఓపెన్‌స్కూల్ అసిస్టెంట్ కోఆర్డినేటర్, జెడ్పీహెచ్ఎస్,మదనపల్లె

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో భార్యా,భర్తలకు గాయాలు

మదనపల్లె : రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొనగా భార్యా,భర్తలు గాయపడిన సంఘటన శనివారం వాల్మీకిపురం మండలంలో జరిగింది. కూరపర్తి పంచాయతీ గంగాదొడ్డి గ్రామానికి చెందిన భార్యాభర్తలు చంద్ర (58), రాణి(50) ద్విచక్ర వాహనంలో వాల్మీకిపురానికి వస్తున్నారు. మార్గమధ్యంలో ఎదురుగా వచ్చిన కారు వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో భార్యా,భర్తలకు గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అక్రమ మట్టి తరలింపు వాహనాల పట్టివేత



అధికారులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

ఒంటిమిట్ట : మండలంలోని మంగంపేట వీరాంజనేయస్వామి ఆలయం వద్ద అక్రమంగా మట్టిని తరలిస్తున్న వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఒంటిమిట్ట తహశీల్దారు ఏవీ.రమణమ్మ తెలిపారు. ఆమె మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తవ్వుతున్నారనే సమాచారంతో దాడులు నిర్వహించి జేసీబీ, ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కడప ఆర్‌డీఓ ఆదేశాల మేరకు మొదటి తప్పుగా భావించి స్వాధీనం చేసుకున్న వాహనాలకు చెరో రూ.5 వేల జరిమానా విధించినట్లు ఆమె తెలిపారు. ఆమె మాట్లాడుతూ అనుమతులు లేకుండా మట్టిని రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

దర్జాగా.. ఆలయ భూములు కబ్జా

అందరికీ వరాలిచ్చి ఆదుకునే అమ్మవారు.. అన్యాక్రాంతమవుతున్న తన భూములను రక్షించుకోలేని పరిస్థితి. పాస్‌ బుక్‌లు సృష్టించుకొని కోట్లరూపాయల ఆస్తులను కొందరు అడ్డంగా దక్కించుకున్నారు. ఆ భూమి ఆలయానిదే అని తనిఖీ అధికారులు తేల్చి చెప్పినా... మళ్లీ రాజకీయ నాయకుల అండతో భూ బకాసురులు కబ్జాకు యత్నం చేస్తున్నారు. రికార్డులను తారుమారు చేసి అందినకాడికి దోచుకుంటున్నారు.

- చౌడూరు గంగమ్మ మాన్యంపై అధికార పార్టీ నేతల కన్ను
- విచారించిన ఆర్డీవో పాస్ పుస్తకాలు రద్దు చేసినా మళ్లీ సాగు
- అమ్మవారికి ఇచ్చిన నగలు కనిపించడం లేదన్న గ్రామస్థులు



చౌడూరు గ్రామంలోని గంగమ్మ ఆలయం

ప్రొద్దుటూరు : రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు అనుకూలంగా ఉన్న కోట్ల రూపాయల విలువ చేసే భూమిపై అధికార పార్టీ నేతల కన్ను పడింది. తమ పలుకుబడితో ఎలాగైనా భూమి దక్కించుకునేందుకు యత్నం సాగిస్తున్నారు. ప్రొద్దుటూరు మండలం చౌడూరులో పురాతన గంగమ్మ ఆలయం ఉంది. ప్రధానమైన యాదవ వర్గీయులతోపాటు గ్రామస్తులు ఇక్కడ అమ్మవారిని కొలుస్తారు. గ్రామానికి సంబంధించిన రెండు కుటుంబాల వారే ఇక్కడ పూజారులుగా ఉన్నారు. ఈ ఆలయానికి సర్వే నెంబర్ 334లో 5.47 ఎకరాల భూమి ఉంది. దేవదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ భూమి విలువ ప్రస్తుతం రూ.5 కోట్ల వరకు ఉంది. దీంతో అధికార పార్టీ నేతల కన్ను పడింది. తమ పలుకుబడిని ఉపయోగించి దేవాదాయ శాఖకు చెందిన 5.47 ఎకరాల భూమి తమదేనని బత్తల పెద్దబసయ్య, బొమ్మనబోయిన నరసమ్మలు రికార్డులు తారుమారు చేసి చెరో 2.735 ఎకరాలకు పాస్‌బుక్‌లు మంజూరు చేయించుకున్నారు. వారి పరిధిలో ఆలయ నిర్వహణ ఉండడంతో ఈ విషయం బయటికి రాలేదు. కొద్ది రోజుల తర్వాత దేవాదాయశాఖ భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలుసుకున్న గ్రామస్థుడు చెల్లుబోయిన శ్రీకాంత్ రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆర్డీఓ శ్రీనివాసులు విచారించి ఈ భూమి దేవాదాయ శాఖకు చెందినది కావడంతో బత్తల పెద్దబసయ్య, బొమ్మనబోయిన నరసమ్మ (వెంకటసుబ్బయ్య)లకు మంజూరు చేసిన పాస్ పుస్తకాలను రద్దు చేస్తూ ఈ ఏడాది జనవరి 25న ఉత్తర్వులిచ్చారు. అయినా ఆయన ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ మళ్లీ సాగుకు ఇద్దరూ సిద్ధమయ్యారు.

అధికార పార్టీ నేతల ద్వారా యత్నం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ భూమిని తిరిగి సొంతం చేసుకునేందుకు ముమ్మరయత్నాలు చేస్తున్నారు. ఆర్డీఓ శ్రీనివాసులు రద్దు చేసిన పాస్ పుస్తకాల విషయంపై బత్తల పెద్దబసయ్య, బొమ్మనబోయిన నరసమ్మ కోర్టును ఆశ్రయించారు. మరో వైపు అధికార పార్టీ నేతల ద్వారా దేవాదాయ శాఖపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే ఈ విషయం తెలుసుకున్న యాదవులు గంగమ్మ ఆలయ తాళాలు తమ వద్దే ఉంచుకుని పూజలు జరిపిస్తున్నారు. అనంతరం పరిశీలించిన వారికి భక్తులు నిలువుదోపిడీ ఇచ్చిన బంగారు, వెండి ఆభరణాలు స్వాహా చేసినట్లు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన బత్తల పెద్దబసయ్య, నరసమ్మ కుటుంబీకులు అధికార పార్టీ నేతలను ఆశ్రయించి ఆలయ తాళాలు తమకు ఇవ్వాలని ఒత్తిడి చేయిస్తున్నారు. దీంతో కొందరు ప్రముఖులను రెండు మార్లు డీఎస్పీ, సీఐ పిలిపించి ఆలయ తాళాలు వారికి ఇవ్వాలని సూచించారు. సున్నితమైన అంశంలో తాను జోక్యం చేసుకోలేనని, నిబంధనల ప్రకారం అది ఆలయ భూమి అని పోలీసు అధికారులకు గ్రామస్తులు చెప్పారు. ఉన్నతాధికారులు ఈ విషయంపై పరిశీలించి చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ట్రాక్టర్ ఢీకొని చిన్నారి దుర్మరణం



మృతి చెందిన రూప

మదనపల్లె : ఇంటి ఎదుట ఆడుకుంటున్న చిన్నారిని ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన విషాదకర సంఘటన తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో జరిగింది. ఎస్ఐ కథనం మేరకు...కోసువారిపల్లెకు చెందిన చరణ్, నందినిల కుమార్తె రూప(2) ఇంటి ఎదుట ఆడుకుంటోంది. ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. రూపను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా.. డాక్టర్లు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె: కుటుంబ సమస్యలతో వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం మదనపల్లె పట్టణంలో జరిగింది. రామారావు కాలనీకి చెందిన అప్సర్ భార్య సిరాజున్నీసా (35), కుటుంబ సమస్యల కారణంగా భర్తతో గొడవ పడింది. మనస్తాపంతో ఇంట్లో ఉన్న సూపర్ వాస్మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బాధితురాలిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. టూటౌన్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

5న 'ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి'పై జాతీయ సదస్సు

వైవీయూ: ఆర్థిక ప్రణాళికతో సంపద సృష్టి పై జాతీయ వెబినార్ ఈనెల 5వ తేదీన వైవీయూ కామర్స్ శాఖ, అసోషియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి వెల్లడించారు. శనివారం విశ్వవిద్యాలయం ప్రాంగణ పరిపాలనా భవనంలోని వీసీ ఛాంబర్ లో వైవీయూ వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, వెబినార్ కన్వీనర్, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథ రెడ్డి వెబినార్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా పూర్వపు డీజీఎం, అసోషియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ కన్సల్టెంట్ సూర్య కాంత్ శర్మ కీలకోపన్యాసం చేస్తారన్నారు. వెబినార్ పాల్గొనే వారికి రిజిస్ట్రేషన్ రుసుము లేదన్నారు. ఈ 'ఈ లింక్ ద్వారా (https://forms.gle/Ck4jku94uU vKhBve7) రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జి.విజయభారతి, డా.హరినాథ్, ఎస్. ఈశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఐదేళ్ల బాలికపై బాలుడి అత్యాచారం

కలికిరి : అభంశుభం తెలియని ఆరేళ్ల బాలికపై 14 ఏళ్ల బాలుడు అత్యాచారానికి పాల్పడిన ఘటన శనివారం సాయంత్రం అన్నమయ్య జిల్లా కలికిరి మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పత్తేగడ గ్రామం గువ్వలతోపు వడ్డిపల్లికి చెందిన ఐదేళ్ల బాలిక అదేగ్రామంలో పాఠశాలకు వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి వస్తోంది. గమనించిన అదే గ్రామానికి చెందిన 14 ఏళ్ళ వయస్సు గల పదో తరగతి చదువుతున్న బాలుడు ఆ బాలికకు సమోసా ఇస్తానని మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లి అఘాయిత్యానికి ఒడిగట్టాడు. బాలిక కేకలు వేసి అక్కడి నుంచి ఇంటికి వెళ్లి తల్లిదండ్రులకు తెలిపింది. ఈ మేరకు బాలిక తల్లిదండ్రులు పోలీస్ స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. బాలికను కలికిరి ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. పోలీసులు బాలుడిని ఆదుపులోకి తీసుకున్నారు. సీఐ ఆర్.మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాయచోటి డిఎస్పీ వి.రామచంద్రరావు శనివారం రాత్రి గువ్వలతోపు వడ్డిపల్లికి వెళ్లి విచారించారు.

అడవిలో తప్పిపోయిన వ్యక్తి.. క్షేమంగా ఇంటికి



తోట హరిబాబును కుటుంబ సభ్యులకు అప్పచెబుతున్న పోలీసులు

నందలూరు : అడవిలో తప్పిపోయిన వ్యక్తిని పోలీసులు కాపాడి క్షేమంగా కుటుంబసభ్యులకు అప్పజెప్పారు. ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్ వివరాల మేరకు.. పెనగలూరు మండలం నారాయణ నెల్లూరు గ్రామానికి చెందిన తోట హరిబాబు ఈ నెల 2వతేదీన సౌమ్యనాథస్వామి ఆలయానికి వచ్చి తిరిగి ఇంటికి రాలేదు. బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్ఐ అబ్దుల్ జహీర్, రవితేజ, దిలీప్ అడవిలో గాలింపు చర్యలు చేపట్టారు. నందలూరు పంచాయతీ, ఈదరపల్లె శివారున హరిబాబుకు చెందిన మోటార్ సైకిల్ కనిపించడంతో అక్కడి నుంచి గాలించారు. సుమారు పది కిలోమీటర్ల దూరంలో హరిబాబును గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు.

వేధింపులు తాళలేక ఉపాధ్యాయురాలి ఆత్మహత్యాయత్నం



ఆత్మహత్యకు పాల్పడిన హిందీ గెస్ట్ టీచర్ సునీత

రాయచోటి టౌన్ : సంబేపల్లె ఏపీఎస్‌డబ్ల్యూర్ఐఈఎస్ ప్రిన్సిపల్ అరుణ వేధింపులు తాళలేక హిందీ గెస్ట్ టీచర్ సునీత శనివారం ఆత్మహత్యాయత్నం చేశారు. రాయచోటి పట్టణంలోని తన స్వగృహంలో సూసైడ్ నోట్ రాసి పురుగుల మందు తాగగా, గుర్తించిన బంధువులు రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆమె రాసిన సూసైడ్ నోట్‌లో రాష్ట్ర రవాణా, క్రీడలు, యువజన మంత్రికి విన్నవించినట్లు ఉంది. గత ఏడాది ఇదే పాఠశాలలో హిందీ టీచర్‌గా పనిచేస్తున్న ఆమెను పులివెందులకు బదిలీ చేశారు. ఆమె స్థానంలో మరో మహిళ హిందీ టీచర్‌గా పనిచేస్తోంది. తన స్థానంలో మరొక్కరు విధులో చేరడం ఇష్టం లేకపోవడంతో ఆమె కలెక్టర్, విద్యాశాఖ మంత్రికి విన్నవించుకున్నారు. అయినా ఫలితం లేకపోవడంతో శనివారం ఆత్మహత్యాయత్నం చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ సాగిస్తునట్లు తెలిపారు. ప్రిన్సిపల్ వివరణ కోరగా ఈ రోజు (శనివారం)కలెక్టర్ వద్ద ఈ విషయమై చర్చించామని, పులివెందుల బాలికల గురుకుల పాఠశాలకు వెళ్లమని చెప్పామని తెలిపారు.

ఇంటిలో బీరువా పగులగొట్టి చోరీ

– 10 తులాల బంగారం, రూ.4.30 లక్షలు నగదు అపహరణ

కడప అర్బన్ : కడప నగరంలోని ప్రకాష్ నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు బీరువా పగులగొట్టి అందులో పది తులాల బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. పోలీసుల వివరాల మేరకు.. ప్రకాష్ నగర్‌కు చెందిన బాధితురాలు వరలక్ష్మి భర్త రమణయ్య మరణించడంతో అంత్యక్రియలకు చెన్నూరు మండలం కొక్కరాయపల్లికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంట్లో బీరువాలో 10 తులాల బంగారు ఆభరణాలు, రూ.4.30 లక్షలు నగదు వుంచి వెళ్లారు. కార్యక్రమాలు ముగించుకుని శనివారం వరలక్ష్మి ఇంటికి వచ్చి చూడగా తాళాలు పగలగొట్టి ఉండడం గమనించారు. బీరువాలో డబ్బు, బంగారు దోచుకెళ్లినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాద చేశారు. తన భర్త అనారోగ్యంతో బాధపడుతుండడంతో ట్రీట్‌మెంట్ కోసం నగదు తెచ్చి వుంచానని వరలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సంఘటన స్థలాన్ని చిన్నచౌక్ సీఐ పి. నరసింహారెడ్డి, సిబ్బంది పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

31,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం

– ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి



కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి 31,500 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం పథకం అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఏపీ సూక్ష్మ సాగు పథకం జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. కడప కలెక్టరేట్‌లోని ఏపీఎంఐపీ కార్యాలయంలో జిల్లా కంపెనీ ప్రతినిధులతో శనివారం ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదెకరాలకంటే తక్కువ భూమి ఉన్న రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలపై 90 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. ఒక యూనిట్ ధర గరిష్టంగా ఒక్కో రైతుకు రూ.2.18 లక్షల వరకు ఉంటుందన్నారు. ఐదెకరాల నుంచి పదెకరాల మధ్య భూమి కలిగి ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ రైతులకు సూక్ష్మ సేద్య పరికరాలపై 70 శాతం రాయితీ ఇస్తారని, గరిష్టంగా ఒక్కో రైతుకు రూ.3.46 లక్షల వరకు ఇస్తామని తెలిపారు. 5 ఎకరాలకంటే తక్కువ భూమి కలిగిన రైతులకు 55 శాతం రాయితీ, 5 ఎకరాల కంటే ఎక్కువ భూమి కలిగిన రైతులకు 45 శాతం రాయితీతో తుంపర సేద్యం పరికరాలు ఇస్తామని తెలిపారు. రైతులు వారి అర్హతను బట్టి మళ్లీ బిందు, తుంపర్ల సేద్య పరికరాలు పొందవచ్చన్నారు. అవసరమున్న రైతులను గుర్తించి వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏ, ఎంఐఏఓల ద్వారా రిజిస్ట్రేషన్లు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీడీ మురళీమోహన్‌రెడ్డి, ఎంఐ ఇంజినీర్లు, ఎంఐడీసీలు, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇసుక తోడేయడంతో.. పంటకు నీరందడం లేదు



సీనియర్ అసిస్టెంట్ కు ఫిర్యాదు చేస్తున్న రైతులు

నిమ్మనపల్లె : బహుదా నదిలో ఇసుక తోడేయడంతో తమ పంటలకు నీరందడం లేదని చంద్రాయుని కాలువ కింద ఆయకట్టు రైతులు రెవెన్యూ అధికారులకు శనివారం ఫిర్యాదు చేశారు. తమ కష్టాలను వివరిస్తూ రైతులు శనివారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రాంప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. రైతులు మాట్లాడుతూ బహుదా నది నుంచి జేసీబీ సాయంతో ఇసుక తవ్వి చుట్టు పక్కల గ్రామాల్లో డంపు చేసి, రాత్రి వేళ మదనపల్లె, బెంగళూరు ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలిపారు. చంద్రాయుని కాలువ కింద 80 మంది రైతులు వంద ఎకరాల ఆయకట్టులో పశుగ్రాసం, టమోటా, వంగ, వరి పంటలు సాగు చేశారన్నారు. ముష్టూరు నుంచి నిమ్మనపల్లె వెటర్నరీ ఆస్పత్రి వరకు ఇసుక తోడి వేయడంతో బోర్లలో నీరు రావడం లేదన్నారు. ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో బోర్లు ఎండిపోయి పంటలు నష్టపోతామన్నారు. అనంతరం రైతులు నిమ్మనపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల హక్కులను గౌరవిద్దాం..



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి : విద్యార్థుల హక్కులను గౌరవిస్తూ వారికి భద్రమైన, సురక్షితమైన బాల్యాన్ని అందించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యాల మీద ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఉద్బోధించారు. స్థానిక కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో శనివారం నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి వర్క్ షాప్ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల నుండి ఎంపిక చేయబడిన పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యాశాఖాధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మాట్లాడుతూ పాఠశాలల్లో బాలల భద్రతకు సంబంధించిన పలు అంశాల గురించి వివరించారు. ఎన్‌సీపీసీఆర్ ప్రతినిధి డాక్టర్ చిట్టిబాబు మాట్లాడుతూ విద్యార్థులకు సైబర్ సేఫ్టీ మీద అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయుల మీద ఉందన్నారు. జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలను మానసికంగా, శారీరకంగా హింసించరాదన్నారు. బాలల హక్కులను గౌరవిస్తూ ప్రతి పాఠశాలలో బాలలకు అవసరమైన అన్ని సురక్షిత మార్గాలు అవలంభించాలన్నారు.. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ కరుణాకర్, డైట్ లెక్చరర్లు అజయ్‌కుమార్, శ్రీదేవి, అసదుల్లా, సెక్టోరల్ అధికారులు రాధ, సమీవుల్లా, జనార్ధన్, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాఖ జట్టు ఘనవిజయం



లక్ష్మీనారాయణ (208 పరుగులు)



గౌతమ్ కృష్ణ (129 పరుగులు)



సుశాంత్ (123 పరుగులు)



6 వికెట్లు తీసిన బౌలర్ యువన్

డ్రాగా ముగిసిన మరో రెండు మ్యాచ్‌లు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తు న్న ఏసీఏ అండర్-19 అంతర్ జిల్లాల క్రికె ట్ టోర్నమెంట్‌లో విశాఖ జట్టు విజయం సాధించగా, మరో రెండు మ్యాచ్‌లు డ్రాగా ముగిసాయి. కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 58 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో చివరి రోజున శనివారం 78.2 ఓవర్లలో 226 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుశాంత్ 123, థామస్‌రామ్ 65 పరుగులు చేశారు. విశాఖ బౌలర్లు యువన్ 6 వికెట్లు తీశాడు. దీంతో 7 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విశాఖ జట్టు రెండు బంతుల్లోనే 8 పరుగులు చేసి 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. కాగా శ్రీకాకుళం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 212 పరుగులు చేయగా, విశాఖ జట్టు 432 పరుగుల వద్ద తొలి ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే.

నెల్లూరు జట్టుకు ఆధిక్యం..

వైఎస్ రాజారెడ్డి-ఏసీఏ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 176 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు చివరిరోజు 117.5 ఓవర్లలో వికెట్ల నష్టానికి 530 పరుగులు చేసి డిక్లేర్ చేసింది. జట్టులోని లోహిత్ లక్ష్మినారాయణ 224 బంతుల్లో 29 ఫోర్లు, 2 సిక్సర్లతో 208 పరుగులు చేశాడు. గౌతమ్ కృష్ణ 129 పరుగులతో రాణించాడు. నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్ 3 వికెట్లు తీశాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 9 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 9 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో చిత్తూరు జట్టు 190 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 381 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో నెల్లూరు జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

కృష్ణా జట్టుకు ఇన్నింగ్స్ ఆధిక్యం..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 315 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కృష్ణా జట్టు చివరిరోజు 153.4 ఓవర్లలో 526 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రాజేష్ 85 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు యశ్వంత్ 3, రేవంత్ నాగకుమార్ 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన పశ్చిమ గోదావరి జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 31 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 119 పరుగులు చేసింది. జట్టులోని రేవంత్ నాగకుమార్ 71 పరుగులు, వినయ్ 27 పరుగులు చేశారు. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో పశ్చిమగోదావరి జట్టు 281 పరుగులు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కృష్ణా జట్టుకు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎర్రగుంట్ల : తీవ్ర మానసిక వేదనతోనే అధ్యాపకుడు లింగాల వెంకటరామిరెడ్డి శనివారం ఎర్రగుంట్లలో రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. స్థానికులు, పోలీసుల వివరాల మేరకు.. ప్రొద్దుటూరు పట్టణంలోని నాగేంద్ర నగర్ కాలనీలో నివాసముంటున్న లింగాల వెంకటరామిరెడ్డి.. స్థానిక ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నారు. ఈయన కుమారుడు చేసిన అప్పులకు సంబంధించి కమలాపురం ప్రాంతానికి చెందిన మరో కుటుంబంతో ఇటీవల వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో కమలాపురానికి చెందిన కొందరు అధ్యాపకుడి ఇంటిపైకి వచ్చి దాడికి పాల్పడ్డారు. దీనిపై వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు అందింది. రాజకీయ జోక్యంతో ఈ సంఘటనపై కేసు నమోదు కాకపోగా, నాలుగు రోజుల కిందట అధికార పార్టీ ముఖ్య నేత, ఆయన సోదరుడు సెటిల్‌మెంట్ చేసినట్లు సమాచారం. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన వెంకటరామిరెడ్డి శనివారం యర్రగుంట్ల పట్టణంలోని రైల్వే స్టేషన్‌కు వచ్చారు. రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారని యర్రగుంట్ల రైల్వే హెడ్ కానిస్టేబుల్ రాజారాంరెడ్డి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై ఉన్నా వెంకటరామిరెడ్డి బతికి ఉండేవాడేమోనని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డి ప్రభుత్వాస్పత్రికి వచ్చి వెంకటరామిరెడ్డి భౌతిక కాయాన్ని సందర్శించడంతోపాటు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో గేదెలు మృతి

పులివెందుల రూరల్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లె గ్రామానికి చెందిన రైతు ఓం ప్రసాద్‌కు చెందిన గేదెలను స్థానిక కదిరి రోడ్డులోని గుట్టకు మేత కోసం తీసుకెళ్లాడు. గుట్టలో తెగిపడిన విద్యుత్తు తీగలు గేదెలకు తగలడంతో షాక్‌కు గురయ్యాయి. మూడు పాలిచ్చే ఎనుములు, ఒక లేగ దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. నిత్యం ఎనుముల పాలు అమ్ముకొని కుటుంబాన్ని పోషించుకుంటున్నానని, అవి మృతిచెందడంతో పోషణ భారమైందని బాధితుడు ఓం ప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం సాయం చేయాలని కోరారు.

ఆన్‌లైన్ మోసగాడి అరెస్టు

సింహాద్రిపురం : ఆన్‌లైన్ మోసగాడిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామానికి చెందిన ఉప్పలూరు నాగేశ్వరరెడ్డి ఇటీవల వివాదస్పదంగా తయారయ్యారు. కర్ణాటకకు చెందిన ఓ రాజకీయ నేత అకౌంట్ నుంచి రూ.68 లక్షలు స్వాహా చేశారు. దీంతో ఆ నేత కర్ణాటక పోలీసులను ఆశ్రయించారు. రంగంలోకి దిగిన కర్ణాటక పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. నాలుగు రోజుల కిందట ఉప్పలూరు నాగేశ్వరరెడ్డిని బెంగళూరులో అరెస్టు చేశారు. ఆపై సెర్చ్ వారెంట్‌తో వచ్చిన కర్ణాటక క్రైమ్ పోలీసులు రావులకొలనులోని నాగేశ్వరరెడ్డి ఇంట్లో సోదాలు జరిపారు. పలు పత్రాలు, ఐఫోన్, ల్యాప్‌టాప్ స్వాధీనం చేసుకున్నారు. కాగా ఉప్పలూరు నాగేశ్వరరెడ్డిపై కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలలో ఏటీఎం దొంగతనాలు, అక్రమ మద్యం కేసుతోపాటు ఓ ఎస్ఐను ఢీకొట్టిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ విషయమై సింహాద్రిపురం ఎస్సై అనిల్‌కుమార్ వివరణ కోరగా కర్ణాటక సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ బృందం సెర్చ్ వారెంటుతో రావులకొలను వచ్చినట్లు ధ్రువీకరించారు.